


# అద్దం

-బాలి

"తాతతో వెళ్లు"-

"తాతతో వెళ్లు-తాతతో వెళ్లు-"

తాత చుట్టాన్ని చూడవా!- వెళ్లు వెళ్లు-"

పెళ్లికొచ్చిన అమ్మలక్కలు నా చుట్టూచేరారు- ఒకటే నవ్వులూ వెటకారాలూ

వాకిట్లో ఆగిన రిక్షాలోకి- తెల్లటి ఇస్త్రీ చేసిన లాల్చీకి బొత్తాం పెట్టుకుంటూ తాత ఎక్కాడు. నేను ఆ పెళ్లి ఇంటికి రెండు రోజుల క్రితమే వచ్చాను. కొంతమందితో పరిచయముంది. మరికొంతమందితో అసలు బొత్తిగా పరిచయమేలేదు.

పరిచయమున్న రుక్కమ్మ ముందుకొచ్చి అంది "తాతతో వెళ్లు- ఎక్కడికో వెళ్లాలట" రిక్షాలో కూచున్న తాత కూడా పక్కకి జరుగుతూ అన్నాడు- "రారా అబ్బాయ్! రిక్షాఎక్కు- నువ్వా సాయం చేద్దువుగాని"

రిక్షా ఎక్కాను- అది బయలుదేరింది

అది ఏరకం సాయమో- ఎందుకో ఏమిటో ఎక్కడికో ఏం తెలీదు-

వెనక అమ్మలక్కల నవ్వులు వినిపిస్తున్నాయ్- తాత నవ్వడం లేదు- అలాగని కోపంగానూ లేడు- ఏదో తెచ్చిపెట్టుకున్న గాంభీర్యం- జేబులు వెతుక్కొని చిటికెన వేలంత చుట్టనూ, అగ్గిపెట్టెనూ బయటకులాగి చుట్టను నోట్లోపెట్టుకొని ముట్టించాడు-

ఇపుడు అతనికి సుఖంగా ఉన్నట్టుంది.

"అబ్బాయ్! మనం నరసు ఇంటికెళుతున్నాం- పెళ్లికి పిలవాలి కదా" అన్నాడు.

నేనే ప్రశ్నలూ వెయ్యలేదు- అటు ఇటు నడుస్తున్న మనుషుల్ని- ఇళ్లనూ చూస్తున్నాను- అయితే అలా చూస్తున్నానేగాని తాత చెప్పిన "నరసు" గురించి ఆలోచిస్తున్నాను. అలాగని తాతను అడగలేదు- ఈ తాత నన్నే ఎందుకు వెంటపెట్టుకు వెళుతున్నాడో అర్థం కావడంలేదు-

ఏదయితేనేం మరో పదినిముషాల్లో అదే తేలిపోతుంది.

తాత పేరు అప్పలస్వామి నాయుడు-నాలుగున్నర అడుగులుంటాడేమో ఎత్తు- లాల్చీ,పంచె,నోట్లో చుట్ట, చేతిలో గొడుగు ఇదీ అతని అవతారం- విజయనగరం, బుక్కా వీధిలో పెద్ద పెంకుటిల్లే అతినిది- ఎంత పెద్ద ఇల్లంటే ఈ వీధి మొదలుకొని వెనక వీధి వరకూ అతని ఇల్లే- ఇంటి మధ్యలో నాలుగిళ్ల చావిడీ- గతంలో బాగా ఉన్నట్టు ఆ ఇల్లే చెబుతుంది- అయితే కాలక్రమేణా ఆర్థికంగా చితికిపోయినట్టు ఆ ఇంటిని చూస్తే తెలిసిపోతుంది. కొన్ని గదులు కూలిపోయాయి. బాగున్న గదుల్లో సామాను సర్దుకున్నారు- కూలిన గదు

ల్లోంచి పెరట్లోకి వెళ్లాలంటే ఆ పక్క నుంచీ ఈ పక్క నుంచీ నడుస్తూ ఉంటారు- ఎండా, వర్షమూ ఆ గదుల్లో మామూలే! నేను, మా తెల్ల మామ్మా రాయగఢ్ వెళ్లి తిరిగి వస్తూ విజయగరంలో ఈ తాత గారింటికి వెళ్లాం- మాతెల్ల మామ్మంటే- చిన్నప్పుడే భర్తపోయిన విధవరాలామె. తెల్లనిమల్లు పంచెలు కట్టడం వలన అందరూ తెల్లమామ్మ అనే పిలిచేవారు-కానీ మనిషి నలుపే!-

''అయ్యో- సమయానికి వచ్చారు పిన్నీ- ఈ రెండు రోజులూ ఆగండి, మన యెంకట్రావు గాడి పెళ్లి'' అన్నారు ఇంటివాళ్లు

అలాగా అన్నది మా తెల్లమామ్మ. చటుక్కున నా వేపు తిరిగి ''నీ స్కూలు ఎప్పుడు తెరుస్తార్రా'' అంది

ఇంకా పది రోజులు టైముందన్నాను నేను.

''ఇంకేం! ఉంటాములే- మన వాళ్లు నలుగురూ వస్తారా! చూసి చాన్నాళ్లయ్యింది'' అంది మామ్మ.

అలా అక్కడ సెటిల్ అయిపోయాం-

ఓ పదిహేను నిముషాలయ్యింటుంది. రిక్షావాడు టంగ్ టంగ్‌మని బెల్లు మోగిస్తూ ఆ సందులూ ఈ సందులూ తిప్పి- చివరకు ఓ వీధిలోకి రాగానే ఎక్కడ బాబయ్యా అన్నాడు.

తాత నోట్లోని చుట్టను ఊసి ''అదిగో ఆ నల్ల గేటు ముందాపు'' అన్నాడు

రిక్షా ఆగింది-

రిక్షావాడికి డబ్బులిచ్చి ముందుకు కదిలాం- తాత గేటు తీశాడు- మెట్ల మీద నేను నిలబడ్డాను. గేటు తీసిన శబ్దానికి లోపట్నించి ఓ ఆడగొంతుక ''ఎవులూ'' అంది

నేనే అన్నాడు నాయుడు.

ఆ ఆకారం ముందుకొచ్చింది. మెడ మీద పడుతున్న జట్టును, ముడిచుట్టుకొంటూ ''ఆ ఆс- నాయుడుగారేనేటి- అబ్బోశాన్నాళ్లకి- శాన్నాళ్లకి- దారితప్పిపోన్రు'' అంది

''అబ్బోశాన్నాళ్లకండోయ్-మామీద దయ'' మరో మగ మనిషి గుమ్మంలోకి వచ్చాడు- అతనికీ తాత వయసే ఉంటుంది

''ఏం రాముడూ ఎలా ఉన్నావ్''- అంటూ అతడ్ని పలకరిస్తునే-దారి తప్పిపోలేదు- పని మీదే వచ్చాను నరసూ'' అన్నాడు తాత ఆమెనుద్దేశించి

''లోపలికి రండి- లోపలికి రండి-'' అంది నరసు. ఈవిడే నన్నమాట నరసంటే- ఇందాకే తాత చెప్పాడు-

అటు ఇటు కుర్చీలు సర్దింది

చెంపల మీంచి నీళ్లతడి- తలకి స్నానం చేసింది కాబోలు వీపుపై రవిక తడిసి ఉంది- బొడ్లో దువ్వెన.

ఆ మగమనిషి భుజం మీదున్న తువ్వాలుతో కుర్చీలు తుడిచి ''కూచోండి నాయుడు గారూ'' అన్నాడు.

కూచున్నాం. చుట్టూ చూస్తున్నాను.

''ఈ బాబెవళూ'' అంది నరసు

''మనోళ్లే- అనకాపల్లి ఈళ్లది- పెళ్లికొచ్చారు'' అన్నాడు ''అన్నట్టు'' అని జేబులో చెయ్యి పెట్టి ఓ శుభలేఖ బయటికి తీశాడు. నరసుకి అందిస్తూ-''చిన్నోడు- వెంకట్రావుగాడికి- పెళ్లి. ఎల్లుండి రాత్రి పదిగంటలకి- రాముడ్ని తీసుకొని రా'' అన్నాడు

''వెంకట్రావుకి పెళ్లా- అంటే అందరి పెళ్లిళ్లూ అయిపోయినట్టేనా'' అంటూ ఆ కార్డు రాముడికి అందించింది.

ఓ నాలుగేళ్లపాప గదిమధ్యలో పలకతో ఆడుతోంది. ఆ పాప తన మనవరాలనీ తన దగ్గరే ఉంటోందనీ వాళ్ల అమ్మనాన్నా ఎక్కడో ఉన్నారని చెబుతోంది తాతతో-

లోపల కొంచెం చీకటిగా ఉంది. రెండు మూడు గదులు వరుసగా ఉన్నట్టున్నాయి-

ఈ గదిలో ఆ పక్కా ఈ పక్కా పెద్ద పెద్ద అద్దాలున్నాయి- అవే సగం గోడల్ని కప్పేశాయి- అద్దాల వెనక కాయితాలూ, పుస్తకాలు కుక్కేశారు- అద్దాలు నిలబెట్టడానికి కొట్టిన మేకులకు సంచులూ, గుడ్డలూ, తువ్వాళ్లూ ఓ మేకుకు తడి సవరం, మాసిన రవికా వేలాడుతున్నాయి-

నాకు ఓ పక్కగా చిన్న చెక్కబల్ల ఉంది. దాని మీద ఉన్న సంచిలో బియ్యమున్నాయి. దాని పక్కనే రేషన్ కార్డుంది. అందులో పువ్వుల రాయుడు, భార్య పువ్వుల అప్పల నరసు అని ఉంది.

అయితే ఈమే పూర్తి పేరు అప్పల నరసన్నమాట.

తాత ఏదో ఆలోచిస్తున్నాడు- మాటిమాటికి వీధిలోకి చూస్తూన్నాడు.

రాముడు నిలబడలేక చిన్నబల్ల లాక్కుని కూచున్నాడు. నరసు ఎప్పుడెళ్లిందో లోపలికి మూడు గ్లాసులతో కాఫీ చేసి తెచ్చింది- అందరకీ తలో గ్లాసు అందించింది. కొంగును భుజం చుట్టూ తిప్పుకొని ఒద్దికగా గోడ పక్క నిలబడింది.

ఆమె జుట్టు నెరిసిపోయింది... దవడలు జారిపోయాయి... పళ్లు ఒకటి రెండు ఊడినట్టున్నాయి. రంగు వెలసిన చీర. పసుపు రాసి స్నానం చేసిన ముఖమూ.

''కాఫీలు తీసుకొండి- సుట్టాలందరూ ఒచ్చేసినట్టేనా'' అంది. ఏదో మాటలు కలపాలన్నట్టు ''ఆ ఆс అందరూ ఒచ్చినట్టే-

అసలు సంగతేటంటే అద్దాలు పట్టుకెళ


THE BEST RETAILER AWARD 2007-2008 CMAI

బాలికలకై

ప్రతి రోజు సరికొత్త ఫ్యాషన్లు



CHERMA'S®

365 రోజులూ మీ డబ్బుకు ఖచ్చితమైన విలువనిచ్చే సకుటుంబ రెడీమేడ్ గార్మెంట్ షాపు

తాను- ఆడంగులందరూ వచ్చేశారు కదా! సరదా పడుతున్నారు... పెళ్లయిన వెంటనే తెచ్చిస్తానులే-''

''ఎంత మాట నాయుడుగారు. పట్టుకెళ్లండి- ఆ రోజుల్లో మీరుకొన్నవే గదా- పట్టుకెళ్లండి. పట్టుకెళ్లండి''

''-అందుకే ఈ కుర్రాడ్నీ సాయం తెచ్చాను''

''మీర్రావాలేంటి- సిన్న కబురెడితే నేనే తెచ్చీఓడ్ని కదా'' అన్నాడు రాముడు.

''ఆఁ ఏముందిలే- అప్పుడేదో సరదాగా తీసుకున్నాము. ఈ అద్దాలుసూస్తంటే ఏదో అనిపిస్తది. పగల్లేదు కదా!''

''ఎందుకు పగుల్తాయిగానీ- బోల్డు ఖరీదు- లోపల గదిలో ఇంకో రెండున్నాయి''

''అదే గదా! ఈ అద్దాలు సూస్తంటే, వొయిసు గుర్తొస్తది- గుడ్డ విప్పుకొని ఈటిల్లో ఎన్నిమార్లు సూసుకోలేదు'' తాత చిన్నగా నవ్వాడు

నరసు భళ్లున నవ్వింది-''ఆ వొయసు తిరగొస్తదేటి?'' నవ్వుతూనే అంది.

రాముడు నవ్వుతున్నాడు.

కుర్చీ దిగి వెళ్లి ఓ అద్దాన్ని తడిమి చూశాడు తాత. బెల్జియం అద్దాలు- వాటికి పెద్దపెద్ద ఫ్రేములు మాసిపోయాయి గాని పాడవలేదు- గుడ్డపెట్టి తుడిస్తేచాలు

''లోపలి గదిలోంచి అట్టుకెళ్లండి- రిక్షాలో అట్టుకెళతారా'' అంది నరసు

''ఆ ఆ-'' తాత ఆ గది వేపు అడుగేశాడు- వెనకగా నేనూ వెళ్లాను. పెద్ద పందిరి మంచం, దాన్ని ఆనుకొని గోడకు పెద్ద అద్దం- మంచం మీద మాసిన దుప్పటీ- గదంతా ఏదో ముక్కవాసన-

రాముడు అద్దాలన్నీ దింపి బట్టతో తుడిచాడు. వెనక పెద్ద పెద్ద ఇనప తీగలు వేలాడుతీయడానికి- తాత, నేనూ ఆ రాముడూ అవన్నీ వీధి వరండాలోకి చేర్చాం- రాముడు రిక్షాపిలిచి, అవన్నీ రిక్షాలో పెట్టించాడు

''నరసా!- మేం వెళతాం- పెళ్లికి నువ్వు తప్పక రావాలి సుమా-'' అని రిక్షా ఎక్కాడు తాత- ఆ వెనక నేనూ, రిక్షా బయలుదేరింది- తాత ముఖంలో ఏదో వెలుగు- అటూ ఇటూ కదలకుండా కాళ్ల దగ్గరున్న అద్దాలు పట్టుకున్నాను . తాత మళ్లా చుట్ట తీసి వెలిగించాడు. ''అబ్బాయ్! నరసు చాలా మంచిదిరా అన్నాడు ఉపోద్ఘాతంగా''

''అప్పుడూ మంచిదే- ఇప్పుడూ మంచిదే- ఇప్పుడు వయస్సొచ్చింది. పళ్లూడిపోయాయి, జుట్టు నెరిసిపోయిందిగానీ- తలదువ్వి వాలు జడలో పువ్వులు పెట్టిందంటే రంభలా ఉండేది. సరసాలకు లోటే లేదు.మా బాగా పాడేదిలే-

రాముడుగాడు లేడూ- దాని మొగుడే- మేనమామ. దీని అమ్మకి తమ్ముడే- ఆడు హోర్మోనియం బాగా వాయిస్తాడు. దీని అమ్మపేరు కన్నమ్మ- పెద్దకంతిరీది.

ఒళ్లో శెనక్కాయలు ఏసుకొని తింటూ ఎప్పుడూ గుమ్మంలోనే ఉండేది- దాని చేతిలో విసనకర్ర-'' తాత కాసేపు ఆగేడు-

ఏదో ఆలోచిస్తూ అన్నాడు-

''ఇది నాయేపకంలో ఉండేది- ఆ ఇల్లూ నేనే కొనిచ్చాను- అప్పటిలో నా దగ్గర బోల్డు డబ్బుండేదిలే- ఎందులో చెయ్యిపెట్టినా చాలు- అందులో డబ్బు గలగలమని పడేది.

ఈ విజయనగరంలో- ఆ రోజుల్లో సంత జరిగేది అసలు విశాఖపట్నం జిల్లా మొత్తం మీద ఇదే పెద్ద సంత. లక్షరూపాయల సంతని దానికిపేరు- దాని ఆసీలు నేనే పాడేను కొన్ని సంవత్సరాలు- నాకిందో నాలుగురూ పనోళ్లుండేవోరు. జట్కాబండి మీద ఇంటికి డబ్బు తోలుకెల్లేవాడ్ని''

తాతలో హుషారు తన్నుకొస్తోంది- దానితో ఏవేవో గుర్తొస్తున్నాయ్-

''అన్నట్టు క్రిష్ణా సినిమాహాలు లేదూ- అదీ అప్పుడు మనకిందే ఉండేది.

సినీమాలూ ఆడేవి. నాటకాలు... డాన్సులూ వేయించేవాడ్ని- అణా, బేడా పావలా టిక్కెట్టు. అప్పుడవేక్కువ- ఇది చెబుతుంటే గుర్తొచ్చింది. నా దగ్గరికి ఒకమారు ఒక బక్కమనిషి వచ్చాడు-అతని ఎనక ఓ గుంటుంది. ఈ అమ్మాయి చేత మీ హాల్లో డేన్సు చేయించాలండి. బాగా డేన్సు చెయ్యగలదూ అన్నాడు.

సరే అన్నాను- టికెట్లు పెట్టాం. జనం ఫరవా లేదు బాగానే వచ్చారు- ఆ బక్కమనిషి హార్మనీవాయిస్తుంటే- అతనితో వచ్చిన ఇద్దరాడోళ్లు పాటందుకొనే వారు. ఆ గుంట స్టేజంతా కలదున్నేసి బొంగరంలా గిర్రున తిరిగి ఆడింది. అన్నీ లల్లాయ్ పాటలే!

భరతనాట్యాలూ- భాగ్య నాట్యాలూ ఎవడు చూస్తాడారోజుల్లో-

''లంగరెత్తరా రాముడు మావా!...''

''అద్దరేత్తిరి కాడమద్దెల దరువెందుకురా...''

''రంగమెళ్లి పోతానే నారాయణమ్మా!''


''గొంగూర కొచ్చానురా-''

ఇలా ఉండేవి పాటలు- ''ఆ తర్వాత ఆ అమ్మాయి సిన్మాలలోకెళ్లిపోయింది. ఎక్కడో చూశానురా ఈ పిల్లనీ అనుకున్నాను. కొంచెం వళ్లు చేసింది. అంజమ్మ నుండి అంజలిదేవయ్యింది,'' అన్నాడు తాత. తాతకి జ్ఞాపక శక్తి ఎక్కువే అనుకున్నాను.

''ఈ అద్దాలు నేనే కొన్నాను. ఇంట్లో మామ్మకి అన్నీ తెలుసు. అద్దాలు తెమ్మనమని తానే చెప్పింది!!''

నోట్లో చుట్టను పారేశాడు- ఇల్లొచ్చింది. గొల్లుమని ఇంట్లో ఆడాళ్లందరూ నవ్వులూ కేకలూ, ఆనందంతో బయటకొచ్చారు. మరో అరగంటలో హాల్లో గోడలకి అద్దాలు అమర్చేశాము. ఆడంగులందరూ వాటి ముందుకు చేరారు. కొంతమంది విచిత్రంగా నావేపు చూసి నవ్వుతున్నారు. తాత చుట్టం అదే అప్పల నరస ఎలా ఉందని కొంతమంది అడిగారు-

దాని వెనుక తాత తెగతిరిగాడులే అన్నారు



కొందరు. దానికి తక్కువ పెట్టాడా అన్నారు ఇంకొందరు–

"ఆ ముసలామెనకా!" అన్నాను నేను.

"ఆ ఆ ఇప్పుడు ముసలిదయ్యింది కానీ వయసులో చూడాలి దాని ఒళ్లు విరుపులు" అన్నారెవరో. తాతగారి పెద్ద కూతురు నర్మదమ్మ నా చెయ్యి పట్టుకొని లాగి ఇలా రా అబ్బాయ్! అని పెద్ద గదిలోకి తీసుకెళ్లింది. ఇదొక్కటి చూస్తే తాత గొప్పతనం తెలుస్తుంది. అయినా మిగిలింది ఈ ఒక్కటే అని చిన్న చిన్న పెట్టెలు కిందికిదించి కింద ఉన్న భోషాణం పెట్టెను తెరచింది.

ఇవన్నీ జ్ఞాపకాల దొంతరలా ఉంది. కొంత మంది మా చుట్టూ మూగారు. భోషాణం అడుగు నుండి ఓ మాదిరి పెట్టె తీసింది

"ఇది చందనం పెట్టె– ఈ కింది అరల్లో మా అమ్మ నగలు పెట్టుకొనేది– మొత్తం ఎనిమిది వడ్డాణాలుండేవి ఇంట్లో–

దాని మూత తెరిస్తే– నీలం ముఖమల్ మెరుస్తోంది. చిల్లికానీ, గవ్వముక్కా తప్ప అందులో ఇంకేం లేవు. అయితే మూత వెనక వేపు ఓ గ్రూఫ్ ఫోటో ఉంది. నలుపూ తెలుపుల్లో దానిచుట్టూ అందమైన అల్లికలూ– బంగారం రంగు లతలూ, పింగాణీ పువ్వులతో చాల అందంగా ఉంది. అయితే పురుగులు కొట్టెయ్యడం వలన మాసినట్టుంది.

నర్మదమ్మ వేలితో ఆ గ్రూఫ్ ఫోటో చూపిస్తోంది. తాత మామ్మ, చుట్టూ ఐదుగురు ఆడపిల్లలూ– ముగ్గురు మగపిల్లలతో ఉన్న ఫోటో అది. ప్రస్తుతం పెళ్లికొడుకైన వెంకట్రావు వాళ్లమ్మచేతిలో ఉన్నాడు–

"ఇది నేను, నా పెద్ద చెల్లి సరస్వతి, యోగిని, పావని, శకుంతల, మగపిల్లల్లో పెద్ద తమ్ముడు ధర్మ రావు, సుబ్బారావు– చిన్నోడు వెంకట్రావు–"

ఆడపిల్లలందరికీ పెళ్లిళ్లు అయ్యాయి– మన మల్నే ఎత్తుకున్నారు. మగపిల్లల్లో ధర్మారావు ఇల్లరికం వెళితే సుబ్బారావు ఏదో చిన్నపని చేసుకుంటూ ఖర్గపూర్‌లో స్థిర పడ్డాడు–

వెంకట్రావు వాచీలు రిపేరు చేస్తాడు. పెద్దగా చదువుకోలేదు.

"ఎలా ఉంది ఫోటో?"

"చాల బాగుంది– తీసిన వాళ్లు బాగా తీశారు– ఆడపిల్లలతో పాటు మగపిల్లలకే దండకడియాలున్నాయి. నెత్తిన ముఖమల్ టోపీలు– మామ్మ మెడలో బండెడు నగలున్నాయి– అసలు తాతగారెంత బాగున్నారో వయసులో–"

"అవును– ఇదొక్కటే మిగిలింది–అందుకే నీకు చూపించాను– రాజాగారి దగ్గరకు నైజాం నుంచి ఎవరో వచ్చి ఫోటో తీస్తున్నారంటే అతడ్ని నాన్నగారు రప్పించి– ఇది చేయించారు"

"ఈ బంగారాలూ– ఈ భాగ్యాలూ అన్నీ కరిగిపోయాయి... అయితే అందరూ బాగున్నారు... అదేచాలు" వెనకన ఎవరో మెల్లగా అన్నారు.

తిరిగిచూస్తే మా మామ్మ– తాత గారి భార్య రుక్కమ్మ అంటోంది. నవ్వుతోంది.

ఆమె వంటినిండా– ఇంటినిండా వృద్ధాప్యు ఛాయలు. ఈ ఇంటి గురించి ఎవరూ పట్టించుకున్నట్టులేదు. అందరూ ఈ పెళ్లికే కలిసినట్టున్నారు.

నాకు ఈ ఇంటి గతకాలపు అనుభవం మనస్సులో మెదులుతోంటే– ఎండిపోయిన కందకంలా ఇప్పటి విజయనగరం కోటను చూసిన అనుభూతి కలుగుతోంది.

మరో రెండురోజుల్లో పెళ్లి అయిపోయింది. సందడి తగ్గుతోంది. చుట్టాలు వెనక్కి మళ్లుతున్నారు. నేనూ మా తెల్లమామ్మా బయలుదేరుతున్నాం.

హాల్లోకి వచ్చాం పెట్టె, సంచులతో..

తాత స్నానం చేశాడు కాబోలు, తడితువ్వాలు నడుముకి చుట్టుకుని– పళ్ళాడిన దువ్వెనతో హాల్లోని అద్దం చూసి తలదువ్వుకుంటున్నాడు. నెత్తి మీద అరడజను కన్నా వెంట్రుకలు లేవు. కానీ పదే పదే దువ్వుతున్నాడు. అద్దంలో గత అనుభవాలతో తనెంత అందంగా ఉన్నట్టు సంబరపడుతున్నాడో అతని ముఖంలోని తృప్తే చెబుతోంది.

వెళ్లొస్తామని శెలవుతీసుకొని మేం బయలుదేరాం.

★

